క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తామరాపల్లి, సత్యవరం, కంబకాయ, బొరిగివలస, జమ్ము, కరగాం, గొట్టిపల్లి, దూకులపాడు, ఈదులవలస జంక్షన్, చల్లబంద, కేపీ.వలస, జిల్లోడు మాకివలస, చీడివలస, పిరువాడ, జడూరు తదితర గ్రామాలకు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఉమామహాల్‌కు నోటీసులు


నోటీసులు అంటిస్తున్న పంచాయతీ సిబ్బంది

పాతపట్నం: మండల కేంద్రంలోని ఉమామహాల్‌లో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, తక్షణమే నిర్మాణ పనులు ఆపాలని బుధవారం పంచాయతీ సిబ్బంది నోటీసులు అంటించారు. ఉమామహాల్‌ను రీమోడలింగ్ నిర్మాణ పనులకు పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని, అందువల్ల భవన నిర్మాణ పనులు నిలుపుదల చేయమని నోటీసులు అంటించామని ఈఓ టి.కూర్మారావు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: గరిష్ఠ వేతనం పొందేలా ఉపాధి పనులు చేయాలని వేతనదారులకు ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని కుంటిభద్ర గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. వేతనదారుల హాజరును పరిశీలించారు. తప్పుడు మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమయపాలన పాటించాలన్నారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నేత్ర వైద్య సేవలు

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారానికి మూడు రోజుల పాటు కంటి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యుడు ప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రతీ సోమ, బుధ, శుక్రవారాలలో సారవకోట పీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కంటి సమస్యలున్నవారు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

గణితంపై భయం వీడాలి


సూచనలిన్న ఉపాధ్యాయుడు ఆనందరావు

పాతపట్నం: విద్యార్థులకు గణితంపై భయవీడి మ్యాజిక్ మాథ్స్‌పై అవగాహన పెంచుకోవాలని, ప్రతీరోజు మాథ్స్ ప్రాక్టిస్ చేయడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని గణిత ఉపాధ్యాయుడు పి.ఆనందరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం మ్యాజిక్ మాథ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ ఉచితంగా వివిధ రకాల శిక్షణ తరగతులను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బి.బెనర్జీ, పాఠకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


నినాదాలు చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది

బూర్జ: కిశోర బాలికలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ బూర్జ సెక్టార్ సూపర్‌వైజర్ పి.రత్నం అన్నారు. మండల కేంద్రంలో గల బూర్జ గ్రామంలో బుధవారం ప్రపంచ మెన్‌స్ట్రువల్ హైజనిక్ డే సందర్భంగా 14-18 ఏళ్ల వయస్సు ఉన్న బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర్ బాలికలతో ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు తెలియజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రత్నం మాట్లాడుతూ రుతుక్రమం సమయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలి, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, బాలికలు పాల్గొన్నారు.

మలుపు ప్రమాదానికి పిలుపు


ఏజీ రోడ్డులో ఆమదాలవలస, పురుషోత్తపురం, రొట్టవలస వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలో మలుపులు ప్రమాదస్థితిలో దర్శనమిస్తున్నాయి. మలుపుల వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. కొత్తగా రహదారిలో ప్రయాణించేవారు చాలా ఇబ్బంది పడుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- సరుబుజ్జిలి

కార్డన్ సెర్చ్


మండలంలోని సింగన్నపాలెంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై ఆమదాలవలస-2 ఐ.నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్, ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. వివాదాస్పద వ్యక్తులు, అనుమానితులు ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. పశువుల శాలలు, గడ్డివాములు క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 60 ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తగిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. పత్రాలు లేని వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూర్జ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.
బూర్జ

భానుడి ప్రతాపం


ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలో బుధవారం 45 డిగ్రీల సెల్సియస్ ఎండ నమోదైంది. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఎండ తీవ్రత తట్టుకోలేకపోయారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.
బూర్జ

యాజమాన్య పద్ధతులతో మేలు


బూర్జలో సాగు చేస్తున్న చెరుకు పంట

ఏఓ వి.రాజేశ్వరరావు

బూర్జ: చెరుకు పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో రైతులు చెరుకు పంటను పండిస్తున్నారు తెలియజేశారు. బూర్జ, వావాం, గుత్తావల్లి, లాభాం, నీలాపురం, అల్లెన తదితర గ్రామాల్లో చెరుకు పంటను విస్తారంగా పండిస్తున్నారన్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు 60 టన్నుల వరకు పంట దిగుబడి సాధించవచ్చునన్నారు. సకాలంలో ఎరువులు, నీరు, అంతరకృషి వల్ల మంచి దిగుబడి సాధించవచ్చునన్నారు. సాలుకి, సాలుకి మధ్య దూరం 4-5 అడుగులు ఉండాలన్నారు. ఎకరాకు 16 వేల మూడు కళ్ల ముచ్చలు అవసరం ఉంటుందన్నారు. మమ్ము చెరుకు ప్రతీ రెండు సంవత్సరాలకు మార్చాలన్నారు. సారం తగ్గే అవకాశం ఉండటంతో నేల మార్పు అవసరమన్నారు. ఎరువులు ప్రతీ 45 రోజులకు, 90 రోజులకు క్రమ తప్పకుండా వేయాలన్నారు. నత్రజని 45, భాస్వరం 48, పొటాష్ 40 నిష్పత్తిలో ఎకరాకు వేయాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే కనీసం 50 టన్నులు వరకు ప్రతీ ఎకరాకు పంట దిగుబడి సాధించవచ్చునన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి

● ఇంటింటికీ వెళ్లి ఉపాధ్యాయుల ప్రచారం


నరసన్నపేట: శివనగర్ కాలనీలో హెచ్‌ఎం జయరావ్‌కు అంగీకారపత్రం అందజేస్తున్న విద్యార్థి తల్లి


జలుమూరు: సురవరంలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


జలుమూరు: లింగాలవలసలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని, నిపుణులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. దేశవానిపేట యూపీ స్కూల్‌కు చెందిన హెచ్‌ఎం ఎస్.జయరావ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ప్రచారం చేపట్టారు. పుస్తకాలతోపాటు దుస్తులు, బ్యాగు, నోట్ బుక్స్ ప్రభుత్వే ఉచితంగా ఇస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేస్తున్నామని తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తుందని, ఇప్పటివరకు 15 మంది పిల్లలు ఒకటో తరగతిలో చేరేందుకు అంగీకారం తెలిపారని హెచ్‌ఎం తెలిపారు. మిగిలిన తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చేర్పించాలని కోరారు.

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. మండలంలోని లింగాలవలస, సురవరం పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో బుధవారం క్యాంపెయిన్ నిర్వహించి విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ బడిలో చేరితే ఉచితంగా భోజనం, పుస్తకాలు, దుస్తులు, బూట్లుతోపాటు మంచి క్రమశిక్షణ కలిగి ఉంటారన్నారు. ఉపాధ్యాయులు ఉంగటి అప్పల సూర్యనారయణ, జల్లు రమణ మూర్తి, బాదాన జగన్ తదితరులు పాల్గొన్నారు.

పూడిక తొలగించండి


గొటివాడవద్ద పిచ్చిమొక్కలతో నిండిపోయిన 20 ఆర్ కూర్మనాథపురం కాలువ

జలుమూరు: మండల పరిధిలో గల వంశధార 19 ఆర్ పర్లాం, 20 ఆర్ కూర్మానాథపురం కాలువలో పిచ్చిమొక్కలు, పూడిక పేరుకు పోవడం వల్ల ఈ ఏడాది సాగు నీరు పంట పొలాలకు ఎలా వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభం కానుంది. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. మరో పది నుంచి 15 రోజులలో వరి వెదలు జరగనున్నాయని రైతులు చెబుతున్నారు. వర్షాలు పడడంతోపాటు వంశధార కాలువల ద్వారా నీరు విడిచిపెడితే పంట పొలాతకు నీరు వెళ్లే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంత పొలాలే ఇలా ఉంటే దిగువ ప్రాంతా పొలాలకు సాగునీరు వచ్చే సూచనలు లేవని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తీయాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ దాలయ్య వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తామన్నారు.

మూలకు చేరిన మరుగుదొడ్లు


నిరుయోగంగా ఉన్న మరుగుదొడ్లు

సరుబుజ్జిలి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు పనిచేయక పోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సౌకర్యంలేక పోవడం వల్ల నిరుయోగంగా పడి ఉన్నాయి. బస్‌స్టేషన్‌కు విద్యుత్ సదుపాయం కూడా కల్పించాలని కోరుతున్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు


సంతసీతారాంపురంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలోని పోలమాంబ అమ్మవారు, సంత సీతారాంపురంలో అసిరి తల్లి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఇళ్లన్నీ బంధుమిత్రులతో కలకలలాడాయి. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రిమ్స్ అన్నపూర్ణ సేవకు విరాళం


విరాళం అదిస్తున్న ఫల్గుణరావు

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన కిల్లాన ఫల్గుణరావు, రాధాశైలజ దంపతులు తమ కుమారుడు మోహన వంశీ పుట్టిన రోజు సందర్భంగా రూ.10వేలు విరాళంగా బుధవారం అందజేశారు. దాతలకు అన్నపూర్ణ పథకం అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షులు రఘు పాత్రుని లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు.

సజావుగా మండల సమావేశం

ఎచ్చెర్ల : లావేరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అమ్మాజమ్మ, రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలు శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

లక్ష్యాలను సాధించాలి

● పశుసంవర్ధశాఖ ఏడీ కరుణాకరరావు


శ్యామ్‌సుందర్‌ను సత్కరిస్తున్న ఏడీ, వైద్యులు, సిబ్బంది

పాతపట్నం: పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సిబ్బందికి ఆదేశించారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశుసంవర్ధకశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యులు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, చిటిక వ్యాధి, జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలు పశువులకు తప్పకుండా వేయాలన్నారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక సహాయకుల అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ఆర్.ఎల్.పురం పశుసంవర్ధక సహాయకుడు ఎస్.శ్యామ్‌సుందర్‌ను ఏడీ, పశువైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.శ్రీవాణి, పి.అనిల్, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సరుబుజ్జిలి: హార్మోన్లు సమతుల్యతకు పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని బూర్జ ఐసీడీఎస్ పీఓ గీత తెలిపారు. రుతక్రమం- ఆరోగ్య పరిశుభ్రత అన్న అంశంపై షళంత్రి సెక్టార్‌లో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. బాలికలు, మహిళలు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల రుతక్రమ సమస్యలు రాకుండా నిరోధించవచ్చునన్నారు. ఈ ర్యాలీలో సూపర్‌వైజర్ జానకి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భూసారం పరీక్షలతో మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస రూరల్: పంట పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష తెలిపారు. మండలంలో నిమ్మతొర్లాడ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల భూమిలో ఉన్న లోపాలను తెలుసుకుని వాటిని అధిగమించడానికి ఆస్కారం కలుగుతుందన్నారు. ఇటువంటి పరీక్షలతో రైతులకు పెట్టుబడి తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండా ఇష్టానుసారంగా పంట పొలాలకు ఎరువులు వేయడం వల్ల వాటిలో ఉన్న సాంద్రత కోల్పోయి పంటలు నష్టపోతున్నాయని స్పష్టం చేశారు. భూసార పరీక్షలు నిర్వహించుకోవడంపై మట్టి నమూనాలను రైతుల నుంచి సేకరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా మట్టి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కిశోర్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో బహుళ ప్రయోజనాలు


హిరమండలంలో చేపడుతున్న ఉపాధి పనులు

హిరమండలం: ఉపాధి హామీ పథకం పనులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రధానంగా రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉపాధి పనుల ద్వారా పంట కాలువలు, సాగునీటి చెరువులు బాగుచేస్తుండటంతో పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొలాలకు సాగునీరువస్తుండంతో పంటలు పండి అధిక దిగుబడులు సాధిచేందుకు అవకాశం కలుగుతుంది.

వేతనం పెంచిన ప్రభుత్వం..

వ్యవసాయం పనులు లేని తరుణంలో వేతనదారులకు ఈ పనుల ద్వారా ఉపాధి కలుగుతుంది. ప్రభుత్వం వేతనం పెంచడంతో వారి కుటుంబ అవసరాలకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. గతంలో వేతనం రూ.272 ఉండేది. ప్రస్తుతం రూ.300లకు పెరిగింది.

సమస్యలకు చెక్..

కాలువల ద్వారా సాగునీటి, తాగునీటి చెరువులు, వాడుక చెరువులకు నీరు చేరుతుంది. ప్రజల తాగునీటి సమస్యలకు చెక్ పెట్టినట్లు అయింది. వాడుక చెరువలు నీటితో నిండటంతో పశువులకు తాగునీటి వెతలు తీరాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయి.

నిత్యావసర సరుకుల వితరణ



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని ఖ్యాతి వృద్ధాశ్రమానికి రణస్థలం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎమ్మెస్సీ విద్యార్థి లింగాల సాయికుమార్ బుధవారం నిత్యావరసర సరుకులు వితరణ చేశారు. ఈ విద్యార్థిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సిక్కోలు నారీమణులు సుప్రజా రౌతు, గిరిజాల మహాలక్ష్మీ, ఆర్.శ్రావణి అన్నారు. సిక్కోలు స్వచ్ఛంద సంస్థ ద్వారా జరుగుతున్న సేవలు చూసి స్ఫూర్తి చెందానని సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఉర్లం శివతేజ, నవీన్, మదర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరరావు

ఎచ్చెర్ల : ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డీఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. ఎంఈఓలు జి.రాజకిశోర్, కారు పున్నయ్య ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ పక్కాగా అమలు కావాలన్నారు. నాణ్యత పాటిస్తూ రుచికరమైన వంటకాలు పెట్టాలని సూచించారు. అనంతరం వంటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.